**ప్రెస్‌నోట్**

**ఎన్నికల హామీలు నెరవేర్చని పార్టీలపై కోర్టు కెళ్ళే హక్కు ప్రజలకు కల్పించండి!**

**వ్యవసాయ రుణాల మాఫీకి నిధులు, లబ్దిదారుల వివరాలు ఎన్నికల ముందుగానే ఆయా పార్టీలు ప్రకటించాలి.**

**అధికారంలోకి వచ్చి హామీలు అమలు చేయని పార్టీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి.**

**ఆయా పార్టీల నాయకులను తదుపరి ఎన్నికలలో నిలబడకుండా నిషేధించాలి.**

# రాష్ట్ర ఎన్నికల అధికారికి రైతు స్వరాజ్యవేదిక, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజ్ఞప్తి

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ప్రకటించాక, అన్ని రాజకీయ పార్టీలు తమ పార్టీ మానిఫెస్టోలను (ప్రజలకు హామీలు) ప్రకటిస్తున్నాయి. ఓటర్లను ప్రభావితం చేసి ఓట్లు కొల్లగొట్టడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్న ఈ పార్టీలు, భారత ఎన్నికల కమీషన్ విడుదల చేసిన నియమావళికి (Modal Code of Conduct) విరుద్ధంగా, ఎటువంటి వివరణలు లేకుండా, కేవలం హామీల వర్షాన్ని కురిపిస్తున్నాయి. ఈ హామీలలో కొన్ని అమలుకు సాధ్యం కానివి, అవసరమైన ప్రజలకు కాకుండా అర్హత లేని వారికి లబ్ధిచేకూర్చేవి. ఈ నేపధ్యంలో...

సుప్రీంకోర్టు తీర్పు కనుగుణంగా పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలకు సంబంధించి దేశ స్థాయిలో ఎన్నికల కమీషన్ జారీ చేసిన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ సెక్షన్ 8 ప్రకారం – మన రాష్ట్రంలో రాజకీయ పార్టీలు, విడుదల చేసిన తమ పార్టీ మానిఫెస్టోలలో ఇచ్చిన హామీలకు సంబంధించి, బడ్జెట్ ఎంత అవసరమవుతుంది? హామీ అమలుకు అవసరమైన నిధులను ఎక్కడినుండి సమీకరిస్తారు? ఈ హామీల వల్ల ప్రయోజనం పొందే లబ్దిదారులు ఎవరు? హామీ అమలుకు అవరమైన నిబంధనలు, షరతులు ఏమిటి? తదితర విషయాలపై ఆయా రాజకీయ పార్టీలు ముందుగానే ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలి.

రాష్ట్ర ఎన్నికల కమీషన్, ఇందుకు అనుగుణంగా ఆయా పార్టీలకు నోటీసులు జారీ చేసి, వెంటనే వివరణ రాబట్టాలని కోరుతూ రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు డా॥ జి.వి. రామాంజనేయులు, కన్నెగంటి రవి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పశ్యపద్మ ఈ నెల 7న సెక్రటేరియట్‌లో రాష్ట్ర ఎన్నికల అధికారికి విజ్ఞాపన పత్రం అందచేశారు.

ఈ హామీల వల్ల ఓటర్లు ప్రభావితమై ఆ పార్టీకి ఓట్లు వేసే అవకాశం ఉంది. కాబట్టి, హామీలు ఇచ్చిన రాజకీయ పార్టీ, లేదా ఆ పార్టీతో కూడిన కూటమి అధికారంలోకి వచ్చాక హామీ అమలుకు పూనుకోకపోతే, హామీ అమలును కోరుతూ కోర్టుకు వెళ్ళే హక్కును ఓటర్లకు కల్పిస్తూ గైడ్‌లైన్స్ జారీ చేయాలని ఈ ప్రతినిధి బృందం కోరింది.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించిన రాజకీయ పార్టీల రిజిస్ట్రేషను రద్దు చేయాలనీ, ఆ పార్టీల నాయకులు తదుపరి ఎన్నికలలో పోటీ చేయకుండా నిషేధం విధించాలనీ కూడా ఈ ప్రతినిధి బృందం కోరింది. ఎన్నికల కమీషన్‌కు మేము చేసిన విజ్ఞప్తి రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించేందుకు కాదు. రాజకీయ పార్టీలు ఆచరణ సాధ్యం కాని హామీలను ఇస్తూ ప్రజలను మభ్య పెట్టే వైఖరికి వ్యతిరేకంగా మాత్రమే.

## వ్యవసాయ రుణాల మాఫీపై పార్టీల వాగ్దానాలు ఆచరణ సాధ్యమా?

2014 సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలిచి అధికారంలోకి వస్తే రైతుల వ్యవసాయ రుణాలను, డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ డ్వాక్రామహిళల రుణమాఫీ గురించి వాగ్దానం చేసింది. తెలంగాణ రాష్ట్ర సమితి (టి.ఆర్.ఎస్) పార్టీ, తాము ఎన్నికలలో గెలిస్తే రైతులకు లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని వాగ్దానం చేసింది.

తెలంగాణా రాష్ట్రంలో 2013–14లో 20,207.33 కోట్ల వ్యవసాయ రుణాలు, మిగిలిన ఆంధ్రప్రదేశ్‌లో 47,016.95 కోట్ల వ్యవసాయ రుణాలు రైతులకు అందాయి. మొత్తం 67,224.28 కోట్ల వ్యవసాయ రుణాలన్న మాట. మహిళా

స్వయం సహాయక బృందాలకు మరో 22,922.59 కోట్ల రుణాలు అందాయి. ఇవన్నీ కలిపితే 90,146.87 కోట్లన్న మాట. 2014-15 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ 1,83,129 కోట్లలో, ఈ రుణాలు 50 శాతం వుంటాయన్న మాట? వాస్తవ దృష్టితో చూస్తే, మరి ఈ హామీని తెలుగుదేశం పార్టీ ఎలా అమలు చేస్తుంది? వ్యవసాయ రుణాల మాఫీ రాష్ట్ర బడ్జెట్‌లో ఎటువంటి స్థితిని సృష్టిస్తుంది? ఈ మాఫీ వల్ల నిజమైన లబ్దిదారులు ఎవరు అన్నది స్పష్టం చేయకుండా, కేవలం వ్యవసాయ రుణ మాఫీని ప్రకటించడం ఓటర్లను ప్రభావితం చేయడానికేనన్నది స్పష్టం.

వాస్తవానికి, సన్న, చిన్నకారు, మధ్య తరగతి రైతు కుటుంబాలన్నీ ప్రైవేటు అప్పుల ఊబిలో కూరుకుపోయి వున్నాయి. వాస్తవసాగు దారులకు అందుతున్న సంస్థాగత రుణాలు చాలా తక్కువ. వ్యవసాయం చేయకపోయినా, భూముల యజమానులకు, వ్యవసాయ రుణాల పేరున కంపనీలకు, వ్యాపారులకు మాత్రమే బ్యాంకు రుణాలు అందుతున్నాయి. ఈ స్థితిలో రాష్ట్ర బడ్జెట్‌లో సగం, అర్హులు కాని వారికి రుణమాఫీ చేయడానికి పోతే ఎలా అనేదే మా ఆందోళన.

తెలంగాణాలో 2013-14లో 14,440.05 కోట్ల పంట రుణాలు రైతులకు అందాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ 2 నుండీ తెలంగాణా రాష్ట్రం ఏర్పడితే బడ్జెట్ పరిమాణం లక్ష కోట్లకు మించి ఉండకపోవచ్చు. అటువంటి సందర్భంలో ఇంత పెద్ద మొత్తంలో పంట రుణాల మాఫీ సాధ్యమేనా? అన్నది టీ.ఆర్.ఎస్. పార్టీ కూడా వివరణ ఇవ్వాలి.

డ్వాక్రా రుణాల మాఫీకి సంబంధించి కూడా వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఇటువంటి వివరణనే ప్రజలకు ఇవ్వాల్సి వుంది.

సంస్థాగత రుణాల పంపిణీలో కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల మధ్య, వివిధ జిల్లాల మధ్య కూడా తీవ్రమైన వ్యత్యాసాలున్నాయి. కౌలు రైతులకు, మహిళా రైతులకు రుణాలే అందడం లేదు. ఈ నేపధ్యంలో వాస్తవసాగుదారులందరికీ సంస్థాగత రుణాలు అందించడం ముందు జరగాలి. ఆ రుణాలు కూడా రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం అందాలి. రుణాల పంపకంలో ప్రాంతాల మధ్య, జిల్లాల మధ్య వ్యత్యాసాలు లేకుండా చూడాలి.


| **డా॥ జి.వి. రామాంజనేయులు** | **పశ్య పద్మ** | **కన్నెగంటి రవి** |
|---|---|---|
| వ్యవసాయ శాస్త్రవేత్త | అధ్యక్షులు, ఆం.ప్ర. రైతు సంఘం | రైతు స్వరాజ్య వేదిక నాయకులు |